ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి

- ఎంపీపీ మోతీరాం
- మండల సర్వసభ్య సమావేశం

మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పెందోర్ మోతీరాం

కెరమెరి, మార్చి 13: సర్పంచుల స్థానంలో నియమితులైన ప్రత్యేకాధికారులు ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని ఎంపీపీ పెందోర్ మోతీరాం సూచంచారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. పాటగూడ, పిట్టగూడ(కొటారి) గ్రామాల్లో తాగునీటి సరఫరాపై తక్షణమే చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రతి రోజూ పారిశుధ్య కార్యక్రమాలు యధావిధిగా కొనసాగించాలని, విధి నిర్వహణలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించవద్దని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వేశ్వర్ మాట్లాడుతూ మిషన్ భగీరథ పథకం ద్వారా గ్రామాల్లో తాగునీటి సరఫరా చేస్తున్నామని, కొన్ని గ్రామాల్లో బోర్‌బావి నుంచి పైప్‌లైన్‌తో నీటి సౌకర్యం కల్పించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. చాలా గ్రామాలో మిషన్ భగీరథ నీళ్లు తాగడం లేదని, ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైస్ ఎంపీపీ సయ్యద్ అబూల్ కలాం సూచించారు. ఏవో గోపికాంత్ మాట్లాడుతూ యాసంగి పంట సాగు కోసం ఇప్పటి వరకు 4 ఎకరాల లోపు ఉన్న రైతులకే పెట్టుబడి సాయం అందిందని, మిగతా రైతులకు త్వరలోనే రైతుబంధు నిధులు విడుదల కానున్నట్లు చెప్పారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో వచ్చే హరితహారం కార్యక్రమం నాటికి 50వేల మొక్కలు సిద్ధం చేశామని, అవసరమున్న వారికి మొక్కలు పంపిణీ చేస్తామని ఎఫ్‌బీవో రామయ్య తెలిపారు. కెరమెరి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యాధికారులతో పాటు ల్యాబ్ టెక్నీషియన్, సిబ్బంది కొరత ఉందని ఇన్‌చార్జి వైద్యాధికారి వినోద్‌కుమార్ సభ దృష్టికి తెచ్చారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని సభలో తీర్మానించారు. విద్యుత్ సబ్ ఇంజినీర్ రమేశ్ తమ నివేదికను సభకు వివరిస్తుండగా ప్రతి రోజు విద్యుత్ సరఫరాకు ఎందుకు అంతరాయం ఏర్పడుతుందని సభ్యులు ప్రశ్నించారు. దీంతో ఆయన స్పందిస్తూ గ్రామాల్లో విద్యుత్ వాడకం పెరగడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని వివరించారు. అనంతరం నూతన ఎంపీడీవోతో పాటు ప్రత్యేకాధికారులుగా నియమితులై మొదటిసారి మండల సమావేశానికి హాజరవడంతో ఎంపీపీ, జడ్పీటీసీ సెడ్మాకి దుర్పతాబాయి, వైస్ ఎంపీపీ అబూల్ కలాం, ఎంపీటీసీలు వారిని శాలువాలతో సన్మానించారు. ఇక్కడ తఎంపీడీవో కృష్ణారావు, ఎంపీవో అమ్జద్‌పాషా, మిషన్ భగీరథ డీఈ రాకేశ్, ఏఈ విశ్వేశ్వర్, పీఆర్ ఏఈ స్టీవెన్, సూపరింటెండెంట్ సుధాకర్, రెవెన్యూ శాఖ సీనియర్ అసిస్టెంట్ సెవంతా, పీఆర్ సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణప్రసాద్, ప్రత్యేకాధికారులు స్వర్ణలత, చంద్రశేఖర్, ఆడే ప్రకాశ్ ఉన్నారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

దహెగాం పంచాయితీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో సురేష్‌బాబు

దహెగాం,మార్చి13:గ్రామాల్లో పారిశుధ్యంపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని డీఎల్‌పీవో సురేశ్‌బాబు హెచ్చరించారు. బుధవారం దహెగాం, కోత్మీర్ గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో రికార్డులను పరిశీలించారు. దహెగాం పంచాయతీకి చెందిన రికార్డులు సరిగాలేవని, పారిశుధ్య లోపాలు ఉన్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. తాగునీటి సమస్యలు లేకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీలకు చెందిన రికార్డులు ఎప్పటికప్పుడు సరిచేయాలని సూచించారు. హరితహారం నర్సరీల నిర్వహణ పక్కాగా ఉండాలని పేర్కొన్నారు. పల్లెప్రకృతి వనాల్లో నాటిన మొక్కలకు ప్రతి రోజూ రెండు పూటలా నీళ్లు పట్టాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో రాజేందర్ తదితులు ఉన్నారు.

ప్రభుత్వ దవాఖానలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఆసిఫాబాద్,మార్చి13: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఖాండ్రే విశాల్ డిమాండ్ చేశారు బుధవారం హిందూవాహిని నాయకులతో కలిసి దవాఖానను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏదైనా ప్రమాదం జరిగి ప్రభుత్వ దవాఖానకు వస్తే ప్రాథమిక చికిత్స కోసం టీటీ , హైడ్రోజన్ పెరాక్సైడ్ కూడా అందుబాటులో లేవని ఆరోపించారు. సిబ్బంది సైతం రోగులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో హిందూవాహిని జిల్లా ఉపాధ్యక్షులు సైదం నాగరాజు, గడ్డల ప్రణయ్, బీజేపీ నాయకులు గడ్డల మల్లన్న, సాయి, తిరుపతి, పిడుగు మహేశ్ తదితరులున్నారు.

గ్రంథాలయాన్ని అందుబాటులోకి తేవాలి

గ్రంథాలయ భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్నఅదనపు కలెక్టర్ దీపక్ తివారీ

ఆసిఫాబాద్,మార్చి 13: జిల్లా కేంద్రంలో కొత్తగా నిర్మిస్తున్న జిల్లా గ్రంథాలయ భవన పనులను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ అన్నారు. జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థుల కోసం అవసరమైన పుస్తకాలను అందించి ప్రోత్సహించాలని కోరారు. పాఠకులకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచాలన్నారు.

అణగారిన వర్గాల అభ్యున్నతి కోసమే 'సూరజ్'

దేశంలోని అణగారిన వర్గాల అభ్యున్నతి కోసమే సూరజ్ పోర్టల్‌ను వర్చువల్ విధానం ద్వారా ప్రధానమంత్రి ప్రారంభించారని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అధికారి సజీవన్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ కోవ హనుమంత రావు, మెప్మా పీడీ మోతీరాం, యూనియన్ బ్యాంక్ నోడల్ అధికారి తివారీ, నాబార్డ్ డీడీ వీరభద్రారావుతో కలిసి బుధవారం జ్యోతి ప్రజ్వలన చేశారు. వర్చువల్ విధానం ద్వారా పీఎం నరేంద్ర మోడీ తన సందేశాన్ని అందించారు. సంబంధిత అధికారులు, కార్మికులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన

కాగజ్‌నగర్ ఎస్పీఎం కాలనీ, మార్చి 13: జిల్లాలో వర్షపు నీటి నిల్వ గుంతలు, నర్సరీల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) దీపక్ తివారి ఆదేశించారు. కాగజ్‌నగర్ మండలంలోని కోయవాగు, చింతగూడలో వర్షపు నీటి నిల్వ గుంతలు, నర్సరీలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీవో, గ్రామ ప్రత్యేకాధికారి, సహాయ పంచాయతీ అధికారి, పంచాయతీ కార్యదర్శి, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి

లింగాపూర్, మార్చి 13: సీసీ రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత పాటించాలని పీఆర్ ఏఈ ధర్మేందర్ గుత్తేదారులను ఆదేశించారు. మండలకేంద్రంతో పాటు గోపాల్‌పూర్, వంజరిగూడ, మామడపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగాపూర్ మండలానికి ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రూ.కోటీ 5లక్షలు సీసీ రోడ్ల నిర్మాణాల కోసం మంజూరైనట్లు తెలిపారు. జడ్పీటీసీ రక్కాబాయి, సర్పంచ్ సుమలత, రమేశ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

పెంచికల్‌పేట్, మార్చి 13: మండల కేంద్రంలో ఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైన సీసీ రోడ్డు పనులను బుధవారం స్థానిక నాయకులు ప్రారంభించారు. మొత్తం మూడు రోడ్లు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చంద్రమౌళి, ఉప సర్పంచ్ రమేశ్, నాయకులు బాపూజీ, నగేశ్, రమేశ్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఒకరి అదృశ్యం

సిర్పూర్(టీ), మార్చి 13 : హైదరాబాద్‌లోని చంపాపేట్‌కు చెందిన రంగాపురం రాములు (45) అనే లారీ డ్రైవర్ అదృశ్యమైనట్లు సిర్పూర్(టీ) ఎస్ఐ దికొండ రమేశ్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని చంపాపేట్‌కి చెందిన రాములు అనే లారీ డ్రైవర్ ఈ నెల 11న ఛత్తీస్‌గడ్ నుంచి హైదరాబాద్‌కు వస్తుండగా సిర్పూర్(టీ) మండలంలోని పెద్దబండ గ్రామ శివారులో లారీ రిపేర్ అయింది. దీంతో మధ్యాహ్నం భోజనంలోకి పెరుగు తీసుకువచ్చేందుకు పెద్దబండ గ్రామానికి వెళ్లిన వ్యక్తి మళ్లీ తిరిగిరాలేదు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు 8712670512, 8712670544 సెల్ నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

ముగిసిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు

సిర్పూర్(టీ), మార్చి 13 : మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారంతో ముగిశాయి. మొదటి సంవత్సరం ఆఖరు రోజు బైపీసీ విద్యార్థులు కెమిస్ట్రీ, సీఈసీ విద్యార్థులు కామర్స్ పరీక్షల్లో 342 మంది కి 334 మంది హాజరు కాగా, 8 మంది గైర్హాజరైనట్లు ఎగ్జామ్ చీఫ్ సూపరింటెండెంట్ రమేశ్, డీవో శారద పేర్కొన్నారు.

రెబ్బెన, మార్చి 13: ఇందిరానగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న ఇంటర్ ప్రథమ పరీక్షలు బుధవారంతో ముగిసినట్లు పరీక్షలు చీఫ్ సూపరింటెండెంట్ ప్రకాశ్ తెలిపారు. గురువారం ఇంటర్ సెకండియర్ పరీక్షలు, ఈ నెల 16తో వొకేషనల్ పరీక్షలు ముగుస్తాయని వెల్లడించారు.

కౌటాల, మార్చి 13: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు మొత్తం 308 మంది విద్యార్థులకు గాను 12 మంది గైర్హాజరు కాగా 296 మంది పరీక్షలు రాసినట్లు పరీక్షా కేంద్రం సీఎస్ బాలకిషన్ రావు, డీవో దౌలత్ తెలిపారు. రేపటితో ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు ముగియనున్నట్లు పేర్కొన్నారు.

బెజ్జూర్, మార్చి 13: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొత్తం 202 మంది విద్యార్థులకు గాను 13 మంది గైర్హాజరు కాగా 189 మంది పరీక్షలకు హాజరయ్యారు.

కేంద్రాలను పరిశీలించిన డీఐఈవో

కాగజ్‌నగర్, మార్చి 13: కాగజ్‌నగర్ పట్టణంలోని ఇంటర్ పరీక్షా కేంద్రాలను డీఐఈవో శంకర్ బుధవారం పరిశీలించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని వసుంధర కళాశాల, వివేకానంద కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ బుధవారంతో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ముగిశాయని, గురువారం ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు ముగియనున్నట్లు తెలిపారు. ఇంటర్ బోర్డు నిబంధనల ప్రకారం పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించామని వెల్లడించారు. ఇక్కడ బెజ్జూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాజయ్య, అధ్యాపకురాలు అతియాఖానం తదితరులు ఉన్నారు.

ఏజెన్సీ గ్రామాల అభివృద్ధికి కృషి

- సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు
- రోడ్డు పనులకు భూమిపూజ

కాగజ్‌నగర్ టౌన్: రోడ్డు పనులకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి

కాగజ్‌నగర్ టౌన్, మార్చి 13 : ఏజెన్సీ గ్రామాల అభివృద్ధికి కృషిచేస్తానని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. బుధవారం మండలంలోని కొత్త, పాత అనుకోడ మధ్య బీటీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐటీడీఏ ద్వారా మంజూరైన రూ.76 లక్షల నిధులతో బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణంతో రెండు గిరిజన గ్రామాల ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని చెప్పారు. ఐటీడీఏ ద్వారా ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రతిపాదనలు పంపామని, త్వరలోనే పనులను చేపడతామని స్పష్టం చేశారు. బురదగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని రాజీవ్‌నగర్‌లో జాతీయ ఉపాధిహామీ పథకం కింద రూ.5 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 కోట్లతో నియోజకవర్గంలోని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ శంకరయ్య, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, నాన్‌సింగ్, ఏఈ భద్రుద్దీన్, శేఖర్, అరుణ్‌లోయా, రమేశ్, కార్తీక్, తిరుపతి ఉన్నారు.

సరస్వతీ శిశుమందిర్ అభివృద్ధికి కృషి

కాగజ్‌నగర్, మార్చి 13: శ్రీ సరస్వతీ శిశుమందిర్ అభివృద్ధికి కృషి చేస్తానని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు పేర్కొన్నారు. కాగజ్‌నగర్‌లోని ద్వారకానగర్ కాలనీ శ్రీ సరస్వతీ శిశుమందిర్ 51వ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. శిశుమందిరాలు విద్యార్థులకు విద్యతో పాటు సంస్కారాన్ని నేర్పిస్తాయన్నారు. ఇలాంటి విద్యాలయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. అనంతరం విద్యాలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్‌పర్సన్ షాహీన్ సుల్తానా, శిశుమందిర్ మంచిర్యాల విభాగ్ కార్యదర్శి దహెగాం గోవింద్ రావు, సమితి అధ్యక్షులు డాక్టర్ దామోదర్‌రావు, దాసరి వెంకటేశ్ పాల్గొన్నారు.

చలి వేంద్రాన్ని ఏర్పాటు చేయరూ ..

వాంకిడి,మార్చి 13:అసలే మండుతున్న ఎండలు పలుగ్రామాల నుంచి మండల కేంద్రానికి రాకపోకలు కొనసాగించే ప్రజలు మధ్యాహ్నం అయితే చాలు దాహం వేసి తాగునీటి కోసం అల్లాడుతున్నారు. మండల కేంద్రానికి వచ్చే ప్రజలు గుక్కెడు నీరు దొరక్క తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారు.నీళ్ల బాటిళ్ల కొనడానికి ఆర్థిక స్తోమత లేని వారు దాహార్తితో తల్లడిల్లుతున్నారు. మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన వారు పలు పనుల నిమిత్తం మండల కేంద్రానికి వస్తుంటారు. అధికారులు వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని మండల కేంద్రంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

భగత్‌సింగ్ వర్ధంతి సభను జయప్రదం చేయాలి

ఆసిఫాబాద్, మార్చి13: భగత్‌సింగ్ 93వ వర్ధంతి సభలను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మాతృ శ్రీ డిగ్రీ కళాశాల ఆవరణలో వర్ధంతి సభ పోస్టర్లు విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు షాహిద్, జాడి విలాస్, రమ్యకుమారి, సునీత, అనూష, సాయిప్రియ, మీనాక్షి, జీవన్, విఘ్నేష్, బాలాజీ ఉన్నారు.

చింతలమానేపల్లిలో భారీ వర్షం

చింతలమానేపల్లి, మార్చి 13 : మండల కేంద్రంతో పాటు కర్జెల్లి, బాలాజీ అనుకోడ గ్రామాల్లో బుధవారం వర్షం కురిసింది. మండలంలో అకాల వర్షం కురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మిరప, మొక్కజొన్న, జొన్న, పెసర, శనగ పంటలు దెబ్బ తింటాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సుబ్రహ్మణ్య స్వామి విగ్రహ ప్రతిష్ఠ

కౌటాల, మార్చి 13: శ్రీ శివసిద్ధి హనుమాన్ మందిర్ తాటిపల్లి కుర్తా దేవస్థానంలో బుధవారం సుబ్రహ్మణ్య స్వామి విగ్రహ ప్రతిష్ఠ చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఎల్ములే దత్తు తెలిపారు. హైదరాబాద్ వాస్తవ్యులు రాచర్ల అనూష–సత్యప్రకాశ్, తంగెడిపల్లి అర్చన–ప్రవీణ్ విగ్రహన్ని దానం చేసినట్లు వెల్లడించారు. వేదపండితులు సూరిపెద్ది రాధాకృష్ణ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి, భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ప్రవీణ్, ప్రవీణ, చంపత్, బాపు, బిక్కాజీ, వాసుదేవ్, నారాయణ పాల్గొన్నారు.

ఎంపీపీ కార్యాలయాన్ని సందర్శించిన జడ్పీ సీఈవో

వాంకిడి, మార్చి 13: మండల పరిషత్ కార్యాలయాన్ని జడ్పీ సీఈవో అనిల్ కుమార్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ప్రజాపాలన సేవా కేంద్రంలో వచ్చిన దరఖాస్తుల వివరాలను ఎంపీడీవో వరలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారుల నుంచి వచ్చిన దరఖాస్తులను వెంట వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.ఆ యన వెంట ఎంపీడీవో, ఎంపీవో, ఏపీవో ఉన్నారు.

సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి

వాంకిడి, మార్చి13 : ఎస్‌బీఐ అందిస్తున్న సౌకర్యాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు మేనేజర్ నందకృష్ణ సూచించారు. గోయగాం గ్రామానికి చెందిన కనక రంభాబాయి మూడు నెలల క్రితం మృతి చెందగా ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా కింద రూ. 2 లక్షలు మంజూరయ్యాయి. కాగా బుధవారం బ్యాంకులో మృతురాలి భర్తకు ఆ చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ వివేక్, సర్వీస్ పాయింట్ నిర్వాహకుడు భిక్షపతి తదితరులు ఉన్నారు.

ఐటీడీఏ పీవోకు వినతి

సిర్పూర్(యూ), మార్చి 13 : అటవి హక్కు పత్రాలున్న సాగు భుముల్లో బోర్లు, బావులు తవ్వ కోవడానికి అనుమతి వ్వాలని కోరుతూ బాండేయేర్ గ్రామానికి చెందిన వీటీడీఏ మండలాధ్యక్షుడు కుంర భీంరావ్ బుధవారం ఉట్నూర్ ఐటీడీఏ పీవో కుష్బూకు వినతిపత్రం అందజేశారు. అలాగే ఆశ్రమ పాఠశాలలో సౌకర్యాలు కల్పించాలని కోరారు. స్పందించిన పీవో అటవీశాఖ వారు అడ్డుపడకుండా చూసుకుంటామని, బావులు తవ్వుకోవడానికి అన్ని రకాల సహకారం అందిస్తామని తెలిపారన్నారు.

ఎస్పీని కలిసిన ఏఎస్పీ

ఆసిఫాబాద్, మార్చి13: అదనపు ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ప్రభాకర్‌రావు బుధవారం ఎస్పీ సురేశ్‌కుమార్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీకి పూల మొక్కను బహూకరించారు. కాగా ఏఎస్పీ ప్రభాకర్‌రావులు ఎస్పీ అభినందించారు. నేరాల నియంత్రణలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. ప్రజలతో సమన్వంతో మెలగాలని సూచించారు.

అప్పుల బాధతో వివాహిత ఆత్మహత్య

ఆసిఫాబాద్,మార్చి13: గుడెన్‌ఘాట్‌కు చెందిన మల్లయ్య కూతురు సందవేణి సుమలత(30) పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుడెన్‌ఘాట్‌కు చెందిన కొలవేణి మల్లయ్య కూతురు సుమలతను నెన్నల మండలం మైలారానికి చెందిన రాజ్‌కుమార్‌కిచ్చి 12 ఏండ్ల క్రితం వివాహం చేశారు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. సంవత్సరం క్రితం నుంచి సుమలత గుడెన్‌ఘాట్‌లో పదెకరాల భూమి కౌలుకు తీసుకొని పత్తి పంట వేసింది. నష్టాలు రావడంతో అప్పులు తీర్చలేక భార్యాభర్తలు బాధపడుతుండేవారు. దీం తో సుమలత ఈ నెల 12న ఇంట్లో పురుగులమందు తాగి అపస్మారక స్థితిలో చేరింది. గమనించిన కుటుంబ సభ్యులు దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహేందర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేపటి నుంచి ఓపెన్ వర్సిటీ ప్రాక్టికల్స్

కాగజ్‌నగర్ ఎస్పీఎం కాలనీ, మార్చి 13: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో డిగ్రీ మూడో సంవత్సరం సైన్స్, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు ఈ నెల 14 నుంచి 19 వరకు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఐదో సెమిస్టర్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తారని స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ దత్తాత్రేయ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు 98663 98678, 73829 29651, 94943 14314 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పెంచికల్‌పేట్: వన్ గ్రామ్ గోల్డ్ అందజేస్తున్న సముద్రాల రాజన్న

కెరమెరి: గ్రూప్ డ్యాన్స్ చేస్తున్న మోడి పాఠశాల విద్యార్థినులు

చింతలమానేపల్లి: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సీఐ సాదిక్ పాషా, ఎంపీపీ డుబ్బుల నానయ్య

అలరించిన ఫేర్‌వెల్ డే

- పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు
- పాఠశాలల వార్షికోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు
- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

పెంచికల్‌పేట్,మార్చి13 విద్యార్థులకు పాఠశాల విద్య భవితకు పునాదని తహసీల్దార్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఎంఈవో రమేశ్ బాబు, ఉపాధ్యాయులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. పదో తరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. గత సంవత్సరం మండల టాపర్లుగా నిలిచిన విద్యార్థుల తల్లిదండ్రులకు జడ్పీటీసీ సముద్రాల సరితారాజన్న వన్ గ్రామ్ గోల్డ్ అందజేశారు. పదో తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థులకు చిలువేరి భాస్కర్ ఎగ్జామ్ ప్యాడ్లు, సామగ్రి అందజేశారు. అలాగే కైరాత్, సాయిరాం ఆధ్వర్యంలో విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయనిర్మల, మాజీ సర్పంచ్ చంద్రమౌళి, ఉప సర్పంచ్ రమేశ్, నాయకులు సముద్రాల రాజన్న, వైకుంఠం, చిలివేరి భాస్కర్, ఉపాధ్యాయులు యాదగిరి, శ్రీధర్, నగేశ్, లక్ష్మి, కళావతి పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

కెరమెరి, మార్చి 13: విద్యార్థినులు పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాల పేరు నిలబెట్టాలని జడ్పీటీసీ సెడ్మాకి దుర్పతాబాయి కోరారు. మంగళవారం రాత్రి మోడి బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం జడ్పీటీసీ మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణలత, మాజీ జడ్పీటీసీ ఆత్రం లక్ష్మణ్‌రావ్, మహిళా నాయకురాలు కోవ ఇందిర, గ్రామపెద్దలు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి

రెబ్బెన, మార్చి 13: విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలని రాష్ట్ర ప్రైవేట్ స్కూళ్ల అధ్యక్షుడు దేవ భూషణం సూచించారు. మండల కేంద్రంలోని ఎస్వీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాయాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన డ్యాన్సులు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్‌ఎం దీకొండ సంజీవ్‌కుమార్, పాస్టర్ కరుణాకర్, ఉపాధ్యాయులు విజయకుమారి, తిరుపతి, రాజేశ్, సుజాత, హిమబిందు ఉన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

చింతలమానేపల్లి, మార్చి 13 : విద్యార్థులు చదువుల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కౌటాల సీఐ సాధిక్ పాషా, ఎంపీపీ డుబ్బుల నానయ్య సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించగా వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఇష్టపడి చదవాలని విద్యార్థులకు సూచించారు. హెచ్‌ఎం జయరాజ్, దేవాజీ పాల్గొన్నారు.

ఘనంగా వీడ్కోలు వేడుకలు

కాగజ్‌నగర్, మార్చి 13: రాస్పల్లి జడ్పీఎస్‌ఎస్ లో బుధవారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలుతో పాటు పాఠశాల పదో వార్షికోత్సవం నిర్వహించారు. సత్యనారాయణ, బెజ్జూర్ ఎంఈవో రమేశ్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, హనుమంత్, వరలక్ష్మి ఉన్నారు.

భయం లేకుండా పరీక్షలు రాయాలి

కౌటాల, మార్చి 13: పదో తరగతి విద్యార్థులు నిర్భయంగా పరీక్షలు రాయాలని జడ్పీఎస్ఎస్ హెచ్‌ఎం నారాయణ సింగ్ సూచించారు. మండల కేంద్రంలోని జడ్పీఎస్‌ఎస్‌లో పది విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. విద్యార్థులు నృత్యాలు చేశారు. ఎస్ఎంసీ చైర్మన్ రామచంద్ర నాయక్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్: నృత్యం చేస్తున్న విద్యార్థులు

రెబ్బెన: ఎస్వీ పాఠశాలలో డ్యాన్సు చేస్తున్న చిన్నారులు